సార్.. మా స్కూల్‌లో నీటి సమస్య ఉంది..

వినతిపత్రం ఇచ్చి నెలరోజులైనా సమస్య పరిష్కారం కాలేదు

చెన్నూర్ ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న పాఠశాల ఎస్‌వో, ఉపాధ్యాయులు

కోటపల్లి, జూలై 16 : సార్... మా స్కూల్‌లో నీటి సమస్య ఉంది పరిష్కరించండి అని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు వినతి పత్రం సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదు. కోటపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నీటి సరఫరా లేక పోవడంతో ప్రతిరోజు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కోటపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నీటి సమస్య ఏర్పడగా, ఈ విషయాన్ని అప్పటి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోశ్ దృష్టికి తీసుకుపోగా బోరుబావి నిర్మాణానికి కలెక్టర్ రూ.1.5లక్షలు మంజూరు చేశారు. మంజూరైన నిధులు బోరుబావి నిర్మాణానికి సరిపోనున్నాయని, ఈ విషయమై ప్రత్యేక దృష్టి పెట్టి తమ పాఠశాలకు అదనంగా మరో రూ.50 వేలు మంజూరు చేయించినట్లయితే పాఠశాల బోరుబావికి ఆ నిధులతో విద్యుత్ మోటర్ బిగించి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పాఠశాల ప్రత్యేకాధికారిణి హరిత చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ కు గత నెల 21న వినతి పత్రం సమర్పించారు. తమ పాఠశాల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించి నెల రోజుల సమయం దగ్గర పడుతున్నా సమస్య ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు ఉండటం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వైద్యశిబిరం

సీసీసీ నస్పూర్, జూలై 16: కాంట్రాక్ట్ కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు సింగరేణి యాజమాన్యం కృషి చేస్తుందని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి పేర్కొ న్నారు. మంగళవారం నస్పూర్‌కాలనీ డిస్పెన్సరీలో కాంట్రాక్ట్ కార్మికులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాంట్రాక్ట్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు ఎలాంటి అనారోగ్యాలకు గురి కాకుండా పరిశు భ్రమైనా ఆహారాన్ని తీసుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సివిల్ డీజీఎం ఆనంద్‌కుమార్, వైద్యులు మురళీధర్, లోకనాథ్‌రెడ్డి, ఇంజనీర్లు రాము, సత్యనారాయణ, వైద్య, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతంగా పనులు పూర్తి చేయాలి

-సింగరేణి డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

జైపూర్, జులై 16: సింగరేణి విద్యుత్‌కేంద్రంలో జరుగుతున్న రెండవ యూనిట్ ఓవరాలింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఇతర అధికారులతో కలిసి ఎన్టీపీపీలో జరుగుతున్న రెండవ యూనిట్ ఓవరాలింగ్ పనులను పరిశీలించారు. బాయిలర్, టర్బైన్, జనరేటర్ మరియు ఇతర విభాగాలలో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పనులలో పాల్గొంటున్న అధికారులను డైరెక్టర్ అభినందించారు. వేగవంతంగా పనులు పూర్తి చేసి ఉత్పత్తిని ప్రారంభించాలని తెలిపారు. అనంతం ఉత్పత్తికి సంబందించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో చీఫ్‌ఆఫ్‌ఓఅండ్‌ఎం జైన్‌సింగ్, జీఎం శ్రీనివాసులు, ఏజీఎం సివిల్ ప్రసాద్, ఏజీఎం ఎఫ్‌జీడీ రమణ, ఏజీఎం మదన్‌మోహన్, బాయిలర్ ఇంచార్జి సముద్రాల శ్రీనివాస్, ఎస్‌ఓటూ ఈడీ ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.

విజయవాడ టూ సూరత్!

- రైలులో గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న వ్యక్తిని పట్టుకున్న రైల్వే పోలీసులు
- రూ.6 లక్షల విలువైన 23 కిలోల గంజాయి స్వాధీనం

పట్టుబడిన నిందితుడు, గంజాయితో పోలీసులు

మంచిర్యాల అర్బన్, జూలై 16: రైలులో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు మంచిర్యాల రైల్వే స్టేషన్ జీఆర్‌పీ ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సోమవారం రాత్రి 11 గంటలకు మంచిర్యాల రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నంబర్-1పై రైల్వే పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మూడు బ్యాగులతో కనిపించాడు. వాటిని తనిఖీ చేయగా పెద్ద మొత్తంలో గంజాయి దొరికింది. అతడిని విచారించగా ఒడిషా రాష్ట్రానికి చెందిన రామ్ చంద్రస్వైన్ అని తెలిపాడు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి వద్ద గంజాయిని కొని మిత్రుడు కన్హ బాలాజీ స్వైన్‌తో కలిసి నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలులో విజయవాడ నుంచి సూరత్‌కు వెళ్తున్నట్లు చెప్పాడు. మంచిర్యాలలో రైల్వే పోలీసులను చూసి భయపడి ట్రైన్ దిగి, సూరత్‌కు వెళ్లేందుకు వేరే ట్రైన్ కోసం చూస్తున్నట్లు తెలిపాడు. ఇతని స్నేహితుడు పోలీసులను చూసి పారిపోయాడు. నిందితుడి వద్ద సుమారు రూ.6 లక్షల విలువైన 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు (ఫైల్)

నేడు పీరీల పండుగ

వేడుకలకు ఏర్పాట్లు

చెన్నూర్ టౌన్, జూలై 16 : నేడు జిల్లాలో మొహర్రం వేడుకలు(పీరీల పండుగ)కు పట్టణాలు, గ్రామాల్లో భక్తులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొహర్రం మాసాన్ని ముస్లింలు పవిత్రంగా భావిస్తుంటారు. ఇస్లామిక్ క్యాలెండర్ (హిజ్రి)లో మొదటి నెలను మొహర్రం అని పిలుస్తారు. శాంతి, ప్రజా స్వామ్యం, మానవ హక్కుల కోసం 14 శతాబ్దాల క్రితం జరిగిన చారిత్రాత్మక పోరాటంలో అసువులు బాసిన అమరుల సంస్మరణే మొహర్రం. అందుకే దీన్ని 'షహీద్' మాసంగా పేర్కొంటారు. రంజాన్ మాసం తర్వాత పవిత్ర మాసంగా భావిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో పీరీల పండుగగా పిలుస్తారు. ఈ పేరు వినగానే పీరీలు, నిప్పుల గుండాలు, గుండెలు బాదుకుంటూ 'మాతం' చదవడాలు గుర్తుకొస్తాయి. ముస్లింలలో షియా తెగవాళ్లు ఈ పండుగను పాటిస్తారు. దైవప్రవక్త మహ్మద్ మనుమళ్లు హసన్, హుసేన్‌ల వీరోచిత ప్రాణత్యాగాన్ని జ్ఞాపకం చేసుకుంటూ పీరీలను ఊరేగిస్తారు. ప్రతి ఏడాది పీరీల పండుగను జిల్లాలో భక్తి ప్రపత్తులతో కులమతాలకతీతంగా, చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహిస్తారు. తాత్కాలికంగా ఒక గుడిని ఏర్పాటు చేసుకొని అందులో పీరీలను ప్రతిష్ఠించి మొహర్రం మాసం అయిపోయే వరకూ భక్తిశ్రద్ధలతో ఉపవాసాలతో పూజలు చేస్తారు.

ప్రభుత్వ దవాఖానలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

దవాఖాన సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాల అర్బన్, జూలై 16: మంచిర్యాల జిల్లా జనరల్ ప్రభుత్వ దవాఖాన ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ అన్నారు. మంగళవారం దవాఖానను ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం సూపరింటెండెంట్ హరీశ్చంద్రారెడ్డి, ఆర్ఎంవో భీష్మ, వైద్యులతో మాట్లాడారు. ప్రభుత్వం మత్తు పదార్థాల నిర్మూలనకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా రీహాబిలిటేషన్ సెంటర్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. పోలీస్ అవుట్ పోస్ట్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీసీపీ వెంట సీఐ బన్సీలాల్, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

మందమర్రి, జూలై 16 : తెలంగాణలోని బొగ్గు గనులను ఎలాంటి వేలం నిర్వహించకుండా సింగరేణికే కేటాయించాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ మంగళవారం సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక కన్వీనర్ రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు జక్కుల నారాయణ, ఏరియా ఉపాధ్యక్షుడు జే.శ్రీనివాస్, కేంద్ర నాయకులు సుదర్శన్, పార్వతి రాజిరెడ్డి, టీఎస్‌టీయుసీ నాయకులు సంజయ్‌కుమార్, నారాయణ, మణిరాంసింగ్ పాల్గొన్నారు.

అంధకారంలో ఎస్సీ కాలనీ

కోటపల్లి, జూలై 16 : కోటపల్లి మండలంలోని రాపనపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ అంధకారంలో ఉంటుంది. కాలనీకి విద్యుత్ సరఫరా చేసేందుకు మిని ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాలని విద్యుత్‌శాఖ అధికారుల కోరినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. కాలనీ వాసులు తమ కాలనీకి కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు తెలిపినప్పటికి తమ సమస్యకు పరిష్కారం చూపటం లేదని కాలనీ వాసులు చెపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కాలనీలో ఏర్పాటు చేసిన మిని ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి రూ. 10వేలు అందజేత

రామకృష్ణాపూర్, జూలై 16: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృ ష్ణాపూర్ శ్రీనివాస్‌నగర్‌లో ఇటీవల ఆనారోగ్య సమస్యలతో మృతి చెందిన కొండ శోభన్ బాబు కుటుంబానికి ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆకుటుంబాన్ని పరామర్శించి ట్రస్ట్ ద్వారా రూ. 10,000 చెక్కు ద్వారా అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి సురేశ్, సభ్యులు మల్లేష్, మహేందర్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లో మందు పార్టీ!

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలో పోస్టాఫీస్‌లో మద్యం సీసాలు

-సోషల్ మీడియాలో వీడియో వైరల్

వాంకిడి, జూలై 16: ఓ తపాలా శాఖ అధికారి పోస్ట్ ఆఫీస్‌నే బార్ షాప్‌గా మార్చిన ఘటన వాంకిడి మండల కేంద్రంలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తపాలా శాఖ అధికారి, తన మిత్రులతో కలిసి మద్యం తాగుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ కార్యాలయం ద్వారా అందించే ఆసరా పింఛన్ డబ్బుల్లో అక్రమ కోతలు విధించి జల్సా చేస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ఈ ఘటనపై తపాలా శాఖ జిల్లా అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ఓసీపీని సందర్శించిన డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్, జూలై 16 : శ్రీరాంపూర్ ఓసీపీని మంగళవారం సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్టులు, ప్రణాళికలు(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి సందర్శించారు. శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, పీఓ శ్రీనివాస్‌తో కలిసి డైరెక్టర్ ఓసీపీ క్వారీలోకి దిగి ఉత్పత్తి పనిస్థలాలు పరిశీలించారు. అనంతరం అధికారులతో, ఓసీపీ కాంట్రాక్టు సంస్థలు సీఆర్ఆర్, జీవీఆర్ ప్రతినిధులతో ఓసీపీ మట్టి తవ్వకాలు, రవాణా, బొగ్గు ఉత్పత్తిపై సమీక్షించారు. వర్షాకాలం ఓసీపీ క్వారీలో నీరు నిల్వకుండా చూసుకోవాలని, బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు.

బొగ్గు వినియోగదారుల సూచనలపై తక్షణ చర్యలు

శ్రీరాంపూర్, జూలై 16: రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న అనేక పరిశ్రమలకు బొగ్గునందిస్తున్న సింగరేణి సంస్థ తన వినియోదారుల పట్ల స్నేహ పూర్వకంగా వ్యవహరిస్తుందిని, వారిని వినియోగదారులుగా కాకుండా మా ప్రగతి భాగస్వాములుగా గుర్తిస్తోందని, వారి సౌకర్యం కోసం ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తున్నామని సింగరేణి చైర్మన్ అండ్ ఎండీ ఎన్ బలరామ్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో బొగ్గు ఈ వేలం వినియోగదారులు, వ్యాపారుల సమావేశంలో సీఎండీ మాట్లాడారు. సింగరేణి బొగ్గు వినియోగిస్తున్న సుమారు 80 కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని వారి సూచనలు చేశారు. దీనిపై సీఎండీ బలరామ్ బొగ్గు వినియోగదారులకు ఎటువంటీ ఇబ్బంది కలగకుండా సమాచారం లోపం లేకుండా ఉండేందుకు ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జీఎం మార్కెటింగ్ జీ దేవేందర్, అధనపు మేనేజర్ ఎన్‌వీ రాజశేఖర్‌రావు, డీవైజీఎం రవివాస్తవ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

స్విగ్గీ, జొమాటోలో మద్యం డోర్ డెలివరీ!

న్యూఢిల్లీ, జూలై 16: నచ్చిన ఫుడ్‌ను స్విగ్గీ, జొమాటోలలో తెప్పించుకున్నట్టే.. ఇకపై మద్యాన్ని (పరిమిత స్థాయిలో) కూడా డోర్ డెలివరీ ద్వారా తెప్పించుకునే రోజు త్వరలో రాబోతున్నది. మనకు నచ్చిన మద్యం బ్రాండ్‌ను ఆన్‌లైన్ యాప్‌లో ఆర్డర్ చేసి పొందవచ్చు! న్యూఢిల్లీ, కర్ణాటక, హర్యానా, పంజాబ్, తమిళనాడు, గోవా, కేరళలలో పైలట్ ప్రాజెక్ట్ కింద అమలుజేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ-కామర్స్ సంస్థలతో మద్యం తయారీ సంస్థలు చర్చలు జరుపుతున్నాయని పరిశ్రమ వర్గాలు మంగళవారం మీడియాకు వెల్లడించాయి.

భారత మార్కెట్‌లోకి ఒబెసిటీ డ్రగ్ టర్‌జెపటైడ్!

న్యూఢిల్లీ, జూలై 16: బరువు తగ్గటంలో అద్భుత ఔషధంగా భావిస్తున్న 'టర్‌జెపటైడ్' ఔషధం.. త్వరలో భారత్‌లోనూ అందుబాటులోకి రాబోతున్నది. భారత్‌లో ఈ ఔషధం అమ్మకాలకు సంబంధించి ఫార్మా కంపెనీ 'ఇలి లిల్లీ'కి కేంద్రం త్వరలోనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నది. ఈ ఔషధాన్ని ఇండియాలో టైప్-2 డయాబెటిస్ రోగుల చికిత్స కోసం ప్రధానంగా వాడాలని సూచిస్తున్నా, ఒబెసిటీతో బాధపడుతున్న వారికి దీనిని ఉపయోగించవచ్చునని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ ఔషధాన్ని పెద్ద మొత్తంలో తీసుకున్న రోగుల్లో సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయని ప్రపంచవ్యాప్తంగా జరిగిన క్లినికల్ ట్రయల్స్ చెబుతున్నాయి. భారత్‌లోని డ్రగ్ రెగ్యులేటరీ నిపుణుల కమిటీ కొద్ది రోజుల క్రితం 'టర్‌జెపటైడ్' ఔషధం అమ్మకాలకు ప్రాథమికంగా ఆమోదం తెలిపినట్టు సమాచారం.

అనారోగ్యకర ఆహారాన్ని నిషేధించండి: యూజీసీ

న్యూఢిల్లీ: ఉన్నత విద్యా సంస్థలలో అనారోగ్యకరమైన ఆహార పదార్థాల అమ్మకాన్ని నిషేధించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం దేశంలో అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల కారణంగానే ప్రతి నలుగురిలో ఒకరు ఊబకాయం, మధుమేహం వంటి వ్యాధులతో బాధపడుతున్నారని ఐసీఎంఆర్ నివేదికలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. వీటితో పాటు పలు అసంక్రమిత వ్యాధులకు కూడా ఇవి హేతువుగా మారుతున్నాయని తెలిపింది.

'డ్యూటీలో ముస్లింలు గడ్డంతో ఉండటం తప్పుకాదు'

చెన్నై: మతాచారాలకు అనుగుణంగా గడ్డం కలిగి ఉండటం తప్పేమీ కాదని, అలా ఉన్న పోలీసులపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు చేపట్టవద్దని మద్రాస్ హైకోర్టు తమిళనాడు పోలీస్ శాఖను ఆదేశించింది. ఈ సందర్భంగా న్యాయస్థానం 1957 మద్రాస్ పోలీస్ గెజిట్ 1957ను ప్రస్తావిస్తూ ముస్లింలు విధి నిర్వహణలో గడ్డాలతో ఉండవచ్చునని, అయితే కత్తిరించిన, చక్కనైన గెడ్డాలతో ఉండాలని ఆదేశించింది. మక్కా నుంచి వచ్చిన తర్వాత గెడ్డంతో డ్యూటీకి హాజరైన ఒక కానిస్టేబుల్‌పై అధికారులు చర్య తీసుకోవడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు గడ్డంతో విధులకు హాజరవ్వటంలో ఎలాంటి తప్పులేదని స్పష్టం చేశారు.

పవిత్ర సరస్సు వద్ద అక్రమంగా ఆలయం

డెహ్రాడూన్, జూలై 16: ఉత్తరాఖండ్‌లోని సుధేర్‌దుంగ నది లోయలో స్వయం ప్రకటిత బాబా చైతన్య ఆకాశ్ అక్రమంగా గుడి నిర్మించారని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక పవిత్ర దేవి కుండ్ సరస్సులో స్నానం చేసి ఆయన దాన్ని అపవిత్రం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల కథనం ప్రకారం చైతన్య ఆకాశ్ కొందరు స్థానికులను సముదాయించి వారి సాయంతో సున్నిత పర్యావరణ జోన్‌లో ఆలయాన్ని నిర్మించారు. కలలో దేవుడిచ్చిన ఆదేశాల మేరకే దాన్ని నిర్మించినట్టు ఆయన చెప్తున్నారు. గ్రామస్థుల ఫిర్యాదుపై భాగేశ్వర్ జిల్లా మెజిస్ట్రేట్ పోలీస్ దర్యాప్తుకు ఆదేశించారు.

సేఫ్ జోన్‌పై ఇజ్రాయెల్ దాడి..60 మంది మృతి

జెరూసలేం: దక్షిణ, మధ్య గాజా ప్రాంతాలపై సోమవారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ సైన్యం చేపట్టిన వైమానిక దాడుల్లో 60 మందికిపైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. వేలాదిమంది పాలస్తీనా పౌరులు ఆశ్రయం పొందిన 'సేఫ్ జోన్'లోని టెంట్లను సైతం ఇజ్రాయెల్ సైన్యం లక్ష్యంగా చేసుకుంది. మంగళవారం ఖాన్‌యూనిస్ దక్షిణ ప్రాంతంపై బాంబుల మోత మోగించింది. శరణార్థుల కోసం ఏర్పాటుచేసిన టెంట్లను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుందని, దీంతో ఇక్కడ 17 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని నాజర్ దవాఖాన వర్గాలు ప్రకటించాయి. ఖాన్ యూనిస్ పశ్చిమ యూనిట్ నావల్ కమాండర్‌ను లక్ష్యంగా చేసుకొని మాత్రమే బాంబు దాడులు చేపట్టామని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది.

మళ్లీ చలో ఢిల్లీ

మరోసారి ఢిల్లీ ర్యాలీకి సిద్ధమైన రైతు సంఘాలు

- శంభు వద్ద బారికేడ్లను తొలగించగానే ముందుకు
- డిమాండ్లు సాధించే వరకు ఉద్యమం ఆపేది లేదు
- బీకేయూ నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ స్పష్టీకరణ

చండీగఢ్/ఛత్రపతి శంభాజీనగర్, జూలై 16: దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతుల 'ఢిల్లీ చలో' సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో హర్యానాలో అంబాలా సమీపంలోని శంభు సరిహద్దు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లు, ఇతర దిగ్బంధనాలను తొలగించిన తర్వాత.. మరోసారి ఢిల్లీకి ర్యాలీ చేపట్టేందుకు రైతు సంఘాలు సిద్ధమయ్యాయి. శంభు సరిహద్దు వద్ద జాతీయ రహదారిని తెరిచిన వెంటనే రైతులు మళ్లీ చలో ఢిల్లీ చేపడుతారని భారతీయ కిసాన్ యూనియన్ ఏక్తా సిద్ధూపూర్, సంయుక్త కిసాన్ మోర్చా(నాన్ పొలిటికల్) నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ మంగళవారం వెల్లడించారు. పంటలకు కనీస మద్దతు ధర, ఇతర డిమాండ్ల పరిష్కారం అయ్యేంత వరకు రైతాంగ ఉద్యమం ఆగేది లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రయాణికుల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని శంభు సరిహద్దు వద్ద రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లను వారం రోజుల్లో తొలగించాలని పంజాబ్-హర్యానా హైకోర్టు ఇటీవల హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించిన నేపథ్యంలో దల్లేవాల్ ఈ మేరకు ప్రకటన చేశారు. ఫిబ్రవరిలో ఎస్కేఎం(నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం) ఆధ్వర్యంలో రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో'ను పోలీసులు పంజాబ్-హర్యానాలోని శంభు సరిహద్దు వద్ద అడ్డుకోవడంతో ఆ నెల 13 నుంచి రైతులు అక్కడే బైఠాయించి ఆందోళనలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

జంతర్‌మంతర్ లేదా రామ్‌లీలా మైదానంలో..

ర్యాలీగా ఢిల్లీ చేరిన తర్వాత జంతర్‌మంతర్ లేదా రామ్‌లీలా మైదానంలో శాంతియుత ఆందోళనలు కొనసాగిస్తామని జగ్జిత్ సింగ్ దల్లేవాల్ వెల్లడించారు. బారికేడ్ల తర్వాత తాము కొనసాగించే ర్యాలీని మళ్లీ అడ్డుకొన్నా, రోడ్డును దిగ్బంధించినా ప్రభుత్వానిదే బాధ్యత అని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ ఏడాది మార్చిలో ఆందోళనల సందర్భంగా పోలీసులు అరెస్టు చేసిన నవదీప్ సింగ్‌కు సంఘీభావంగా బుధ, గురువారాల్లో శాంతియుత ఆందోళనలు చేపడుతామని తెలిపారు. నవదీప్ సింగ్‌పై పోలీసులు అల్లర్లు, హత్యాయత్నం వంటి తీవ్రమైన అభియోగాలు మోపారు. హైకోర్టు ఆదేశాలను హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయడంపై దల్లేవాల్ స్పందిస్తూ.. రోడ్డును బ్లాక్ చేసింది ప్రభుత్వమేనని, రైతులు కాదని అన్నారు. ఫిబ్రవరిలో రైతులు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణల్లో మరణించిన రైతు శుభకరణ్ సింగ్ మృతిపై దర్యాప్తునకు ఏర్పాటు చేసిన కమిటీపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.

ఎంఎస్పీ పెంచక ఇబ్బందుల్లో చక్కెర పరిశ్రమ

కేంద్ర ప్రభుత్వం గత ఐదేండ్లుగా మద్దతు ధరను పెంచకపోవడంతో దేశంలోని చక్కెర పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని షుగర్ యూనిట్స్ ఫెడరేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ లిమిటెడ్ డైరెక్టర్ జైప్రకాశ్ దండేగోంకర్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కేంద్రం త్వరితగతిన నిర్ణయాలు తీసుకోకపోవడంతో షుగర్ ఇండస్ట్రీలో వర్కింగ్ క్యాపిటల్‌లో స్వల్ప మార్జిన్లు, అప్పులు వంటి సమస్యలు మళ్లీ తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం చెరకు ఎఫ్ఆర్‌పీని మూడుసార్లు పెంచిందని, అయితే చక్కెరకు ఎంఎస్పీని పెంచలేదని పేర్కొన్నారు. గత ఐదేండ్లుగా అన్ని రాష్ట్రాల ఫెడరేషన్లు డిమాండ్ చేస్తున్నా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన లేదని విమర్శించారు. చెరకు, రవాణా, లేబర్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో చక్కెర ఉత్పత్తి ఖర్చుగా కేజీకి కనీసం రూ.41 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఒమన్ తీరంలో ఓడ బోల్తా

- 16 మంది ఆచూకీ గల్లంతు
- వీరిలో 13 మంది భారతీయులు

మస్కట్, జూలై 16: ఒమన్ తీరంలో చమురు ట్యాంకర్లతో ప్రయాణిస్తున్న ప్రెస్టీజ్ ఫాల్కన్ అనే ఓడ సోమవారం బోల్తా పడింది. ఈ ఓడలో ఉన్న 16 మంది సిబ్బంది గల్లంతయ్యారని ఒమన్ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్(ఎంఎస్‌సీ) తెలిపింది. ఇందులో 13 మంది భారతీయులు కాగా, మరో ముగ్గురు శ్రీలంకకు చెందిన వారుగా గుర్తించారు. వీరి ఆచూకీ కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నది. కొమొరోస్‌కు చెందిన ఈ ఓడ యెమన్‌లోని ఓడరేవు నగరమైన ఏడెన్‌కు వెళ్తున్నట్టు తెలిసింది. రాయ్ మద్రకహ్‌కు ఆగ్నేయం వైపు 25 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన జరిగింది. ఓడ బోల్తా పడటానికి కారణం ఇంకా తెలియరాలేదు. ఓడ ఆచూకీ కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయి.

మస్కట్‌లో మసీదు వద్ద కాల్పులు.. భారతీయుడు మృతి

మసీదు లక్ష్యంగా ఒమన్ రాజధాని మస్కట్‌లో దుండగులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఒకరు భారతీయుడు, నలుగురు పాకిస్థానీయులు ఉన్నారు. కాల్పులకు పాల్పడ్డ వారిలో ముగ్గురు దుండగులను కాల్చి చంపినట్టు పోలీసులు తెలిపారు. వాడీ కబీర్ ప్రాంతంలోని ఇమామ్ అలీ మసీద్ బయట సోమవారం రాత్రి స్థానికులు మతపరమైన వేడుక జరుపుకుంటుండగా ఈ కాల్పులు జరిగాయి. మృతి చెందిన భారతీయుని కుటుంబానికి సహాయ సహకారాలను అందించనున్నట్టు భారత రాయబార కార్యాలయం పేర్కొంది.

కూలీలుగా వేషం మార్చి.. దొంగల ముఠా ఆట కట్టించి

- పుణె పోలీసుల రహస్య ఆపరేషన్
- చోరీకి గురైన 100 బైకులు స్వాధీనం

ముం